సాక్షి
అనంతపురం

మంగళవారం । 29 । జూలై । 2025



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు పలికాయి.



టమాట కిలో రూ.40
అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.40 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.34 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.9°/22.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బాధితులపైనే అక్రమ కేసు బనాయింపు



మాట్లాడుతున్న బాధితురాలు సుధారాణి

అనంతపురం: తమపై టీడీపీ నాయకులు దాడి చేసినా కేసు నమోదు చేయని పోలీసులు.. తమనే నిందితులుగా పేర్కొంటూ అక్రమ కేసు బనాయించారంటూ ఎస్పీ జగదీష్ ఎదుట బాధితురాలు కన్నీటిపర్యంతమైంది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎస్పీని కలసి తన గోడు వెళ్లబోసుకుంది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం ఎం. కొండాపురం గ్రామంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న కె.సుధారాణి, శ్రీనివాసాచారి దంపతులపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వై. సురేష్, లాల్ కృష్ణ ఈ నెల 13న దాడి చేసి దుర్భాషలాడారు. దీనిపై అదే రోజు సుధారాణి కళ్యాణదుర్గం రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నేటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదు. పైగా దాడి చేసిన వారి నుంచి ఫిర్యాదు తీసుకుని సుధారాణి దంపతులపై అక్రమంగా కేసు బనాయించారు. దీంతో న్యాయం కోరుతూ దాడి సమయంలో తీసిన ఫొటోలను జతపరుస్తూ సోమవారం ఎస్పీకి బాధితురాలు ఫిర్యాదు చేశారు. కాగా, ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 87 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా పీఎస్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోలతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు పరేడ్ మైదానంలో ఏర్పాట్లకు సంబంధించి అప్పగించిన బాధ్యతలను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై స్టాళ్లు, శకటాలు సిద్ధం చేసుకోవాలని, ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేసి జాబితాను కలెక్టర్ కార్యాలయానికి పంపించాలన్నారు.

పంటల బీమా చేయించండి

'వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం చెల్లింపు ప్రక్రియ ఈనెల 31తో ముగుస్తుంది. 1,50,100 మంది రైతులకు గానూ ఇప్పటికి 10,194 మందే పంట నమోదు చేసుకున్నారు. మిగిలిన వారు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోండి' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. బీమా అంశంపై ఆయన సమీక్షించారు. పంట సాగు చేసిన ప్రతి రైతూ బీమా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ప్రతిష్టను కాపాడాలి
- ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: ఎస్కేయూ ప్రతిష్టను కాపాడేలా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత అన్నారు. ఎస్కేయూ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'పీఎం ఉష' పథకం కింద వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి తెలియజేశారు. ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రాముఖ్యతను వివరించారు. ఇంక్యుబేషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన విక్రమ సింహపురి వర్సిటీ మాజీ వీసీ, ఎస్కేయూ మాజీ రెక్టార్ ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి మంచి స్థానానికి చేరుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడల్లో సత్తా చాటిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకట నాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పుత్తడికి ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఆర్థికంగా బలవంతులైన వారు హోదాగా భావిస్తే.. సామాన్యులు బంగారాన్ని ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తారు. తమ వద్ద ఉన్న కొద్ది బంగారాన్ని ధరించినప్పుడు సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆనందం అంతా ఇంతా కాదు. కానీ, కూటమి సర్కారు పుణ్యమా అని ఆర్థికంగా కుదేలైన అన్నదాతలు దిక్కుతోచని పరిస్థితుల్లో బంగారాన్ని కుదువ పెడుతున్నారు. కాసింత ఆర్థిక చేయూత కూడా కరువైన దైన్యంలో పుత్తడిని తీసుకుని బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు.



ఆత్మగౌరవం తాకట్టు

గుండె బరువు.. బంగారమే ఆదరువు
- 'కూటమి' ఆర్థిక సాయం కరువై అన్నదాత అగచాట్లు
- పెట్టుబడి సాయం అందక బ్యాంకుల్లో బంగారం కుదువ
- గడిచిన ఏడాదితో పోలిస్తే భారీగా గోల్డ్ లోన్లు
- వివాహాల సీజన్ అయినా రైతులకు విధిలేని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అదిగోఇదిగో అంటూ కూటమి ప్రభుత్వం కనికట్టు చేస్తోంది. 'అన్నదాత సుఖీభవ' సాయం అందించకుండా దాటవేస్తోంది. దీంతో పంటల సాగుకు అన్నదాతలు తమ వద్ద ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో కుదువ పెడుతున్నారు. సాధారణంగా అత్యవసర పరిస్థితుల్లో నగలు తాకట్టు పెట్టి రుణం తెచ్చుకోవడం పరిపాటి. కానీ ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రైతుకు ఎలాంటి సాయమూ దక్కకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో నగలు తాకట్టు పెట్టి అప్పు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లోనూ ఉదయం నుంచే నగల తాకట్టుకు రైతులు క్యూ కడుతున్న దుస్థితి నెలకొంది. గతంలో మండలకేంద్రాల్లోని బ్యాంకుల్లో రోజూ పది దాకా దరఖాస్తులు



కళ్యాణదుర్గంలోని ఏపీజీబీలో బంగారం తాకట్టు పెట్టేందుకు వచ్చిన ఓ రైతు

వచ్చేవి. ఇటీవల 40 నుంచి 50 మంది వరకూ కుదువ పెట్టి రుణం తీసుకుంటున్నారు.

సగటున రోజుకు 4 వేల మందికి పైగా

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులకు బంగారు రుణాలు ఇచ్చే బ్యాంకుల బ్రాంచ్‌లు రమారమి 229 వరకూ ఉన్నాయి. వీటన్నింటిలో రోజుకు 4 వేల మందికి పైగా రైతులు రుణాలు తీసుకుంటున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సగటున ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అనుకున్నా రోజుకు రూ.20 కోట్లపైన ఇస్తున్నట్టు అంచనా. నెలలో 20 రోజుల పాటు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. బంగారం కుదువతో ఇప్పటివరకూ రూ.400 కోట్లకు పైగా బ్యాంకులు రుణాలిచ్చాయి. గతేడాదితో పోలిస్తే 22 శాతం పైగా బంగారు లోన్లు పెరిగినట్టు బ్యాంకర్లు చెబుతున్నారు.

వివాహాల సీజన్ అయినా విధిలేక...

ఇటీవల శ్రావణ మాసం మొదలైంది. ఈ క్రమంలో జిల్లాలో వివాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. పెళ్లి అంటే బంగారు నగలు ఎంత అవసరమో తెలిసిందే. పైగా సెంటిమెంటుతో ముడిపడింది. అయినా సరే నగలు తాకట్టు పెట్టి పంటల కోసం అప్పు తీసుకోవడం రైతుల దీనస్థితికి అద్దం పడుతోంది. ఓవైపు వర్షాభావం, మరోవైపు ఆర్థిక భరోసా లేకపోవడం వెరసి అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

గత సర్కారు హయాంలో రైతు సాయం ఇలా...

అనంతపురం జిల్లాలో రైతు భరోసా లబ్ధిదారులు
2,98,535



రైతు భరోసా కింద ఇచ్చిన సొమ్ము
రూ.**1,879.29**కోట్లు

శ్రీ సత్యసాయి జిల్లాలో రైతు భరోసా లబ్ధిదారులు
2,79,556



రైతు భరోసా కింద ఇచ్చిన సొమ్ము
రూ.**1,767.09**కోట్లు

పెట్టుబడుల కోసం తప్పలేదు



నాకు 8 ఎకరాల పొలం ఉంది.వేరుశనగ,మొక్కజొన్న, టమాట పంటలు సాగు చేశాను. పంటల పెట్టుబడి కోసం మలయనూరు యూనియన్ బ్యాంక్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాను. బంగారం లేకపోయి ఉంటే పంటల పెట్టుబడికి ఇబ్బంది పడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని చెప్పినా ఇంతవరకు పైసా అందించలేదు.

– రుద్రప్పగారి పాలయ్య, శ్రీమజ్జినపల్లి, కుందుర్పి మండలం

విధిలేని పరిస్థితి



సొంత పొలంతో పాటు కౌలుకు తీసుకుని 5 ఎకరాల్లో కంది, ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశా. పెట్టుబడుల కోసం బయటి వ్యక్తులతో అధిక వడ్డీలకు అప్పు చేయలేక విధిలేని పరిస్థితుల్లో నా భార్య ఐదు తులాల బంగారు నగలు బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.2.30 లక్షల రుణం తీసుకున్నా. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందలేదు. అన్నదాత సుఖీభవ నగదు జమ చేసి ఉంటే ఎంతో కొంత ఉపశమనం దక్కేది. – **సంజీవరెడ్డి, రైతు, గుండిగానిపల్లి, బ్రహ్మసముద్రం మండలం**

హెచ్చెల్సీ అక్విడెక్ట్‌కు కోత



కోతకు గురైన అక్విడెక్ట్ గట్టు వద్ద ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని తుంబిగనూరు వద్ద హెచ్చెల్సీ 159/277 కి.మీ సమీపంలో అక్విడెక్ట్ ఎడమవైపు గట్టు ఆదివారం రాత్రి కోతకు గురైంది. గస్తీ నిర్వహించే లస్కర్లు ఈ విషయాన్ని కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్‌రెడ్డి, ఏఈఈ నరేంద్ర మారుతి దృష్టికి తీసుకెళ్లారు. రాత్రిపూట అటుపై ఎవరూ వెళ్లకుండా అధికారులు అప్రమత్తం చేశారు. సోమవారం ఉదయం హెచ్చెల్సీ అధికారులతో పాటు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్ ఘటన స్థలానికి చేరుకొని అక్విడెక్ట్ గట్టు మరింత కోతకు గురికాకుండా చర్యలు తీసుకొన్నారు.నీటి ప్రవాహానికి అవాంతరాలు కలగకుండా ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేయించారు. గజ ఈతగాళ్లు, కూలీల సాయంతో కాలువ అడుగు భాగం నుంచి పైవరకు ఇసుక బస్తాలతో బండ్ వేశారు. హెచ్చెల్సీ అధికారుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పినట్లైంది.కాలువకు గండి పడకుండా యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవడంతో ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

బెస్ట్ పీఎంశ్రీ స్కూల్‌గా గుత్తి ఏపీ రెసిడెన్షియల్

అనంతపురం ఎడ్యుకేషన్: బెస్ట్ పీఎంశ్రీ స్కూల్‌గా గుత్తి ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ఎంపికైనట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ (ఎన్‌ఈపీ) -2020 ఐదో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దేశ వ్యాప్తంగా బెస్ట్ పీఎంశ్రీ స్కూళ్లను జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా గుత్తి ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను కూడా వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని వెల్లడించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ హాజరు కానున్నారు.

మా గోడు వినండి.. ఆదుకోండి

అనంతపురం అర్బన్: 'మా గోడు వినండి.. ఆదుకోండి' అంటూ అధికారులను ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజల నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 560 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్షించారు.అర్జీల పరిష్కారంలో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని నాణ్యమైన పరిష్కారం చూపించాలని చెప్పారు.

వినతుల్లో కొన్ని...
- సాగు చేసుకుంటున్న భూమికి పట్టా ఇప్పించాలని రాప్తాడు మండలం యర్రగుంట గ్రామానికి చెందిన నారాయణమ్మ విన్నవించింది. యర్రగుంట గ్రామ పొలం సర్వే నంబరు 127లో 1.61 ఎకరాలను 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని చెప్పింది. పట్టా మంజూరు చేయాలని 2015 నుంచి అర్జీలు ఇస్తూనే ఉన్నా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన చెందింది.
- తమ భూమికి సంబంధించి అడంగల్, 1బీ రావడం లేదని కళ్యాణదుర్గంలోని పార్వతి నగర్‌కు చెందిన సరోజమ్మ విన్నవించింది. 2006లో ప్రభుత్వం తమకు 5.01 ఎకరాల భూమి మంజూరు చేసిందని, అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నామని తెలిపింది. పాసు పుస్తకం కూడా ఉన్నా 2017 నుంచి 1బీ, అడంగల్ రావడం లేదని చెప్పింది.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



ఈ వృద్ధురాలి పేరు కె.నల్లమ్మ. ఈమెది శింగనమల మండలం కల్లుమడి గ్రామం. ఈమె భర్త చనిపోయి 23 ఏళ్లు అవుతోంది. కల్లుమడి గ్రామ పొలం సర్వే నెంబరు 142/3లో తమ రిజిస్టర్ భూమి 3.09 ఎకరాలు విక్రయించగా మిగిలిన 85 సెంట్లు భూమి ఈమె అనుభవంలో ఉంది. 2021లోనే సర్వే చేసి భూమి కొలతల పటం ఇచ్చారు. పాసు పుస్తకం మంజూరు చేయండంటూ తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఎన్నోసార్లు తిరిగినా పట్టించుకోలేదు. కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చినా పని జరగలేదు. ఈ క్రమంలో పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ మళ్లీ అర్జీ ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చింది.

'ఉపాధి'లో ప్రజాధనం లూటీ

- అధికార పార్టీ నాయకుల అంతులేని దోపిడీ
- మాజీ మంత్రి శైలజనాథ్ మండిపాటు
- శింగనమలలో అక్రమాలపై ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఫిర్యాదు

అనంతపురం అర్బన్: ''శింగనమల నియోజకవర్గ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఉపాధి పనులు అధికార పార్టీ నాయకుల దోపిడీ వనరులుగా మారాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, అధికార పార్టీ నాయకులు ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది' అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు. అక్రమాలు అరికట్టాలని కోరుతూ సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ బుక్కరాయసముద్రం మండలంలో 'ఉపాధి' వాటాల చెల్లింపుల్లో తేడాలు రావడంతో టీడీపీ నాయకులు రోడ్డుపైనే కొట్టుకున్నారన్నారు. నార్పల మండల పరిధిలో అక్రమాలకు పాల్పడిన అధికారిని సస్పెండ్ చేసినట్లు ప్రకటించినా ఇంకా విధుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. పుట్లూరు మండలంలో చనిపోయిన వ్యక్తుల పేరు మీదా బిల్లులు పెట్టి ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకున్నారని చెప్పారు. పనికి హాజరుకాని వారితో వారం రోజుల కూలీలో సగం సొమ్ము, పనికి హాజరైన వారితో వారానికి రూ.200 నుంచి రూ.300 చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది వసూలు చేస్తున్నారన్నారు. అక్రమ సొమ్ములో అధికారులకు వాటాలు ఇస్తున్నట్లు బాహాటంగానే చెబుతున్నారన్నారు. వాటాలు కుదరని చోట రోడ్లపైకి వచ్చి తన్నుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయన్నారు. జిల్లాలో అన్ని చోట్లా అవినీతి చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే అనేక సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కూలీల శ్రమను దోపిడీ చేస్తున్న వారిపై ఇప్పటికైనా చర్యలు తీసుకుని నిబద్ధత చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ప్రతాపరెడ్డి, భాస్కర్, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పూల ప్రసాద్, మహేశ్వరరెడ్డి, ఖాదర్‌వలి, ఎల్లారెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, నాగలింగారెడ్డి, ముసలన్న, సాకే నారాయణస్వామి, బొమ్మన శ్రీరామరెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్వతమ్మ, శ్రీనివాసరెడ్డి, మంత్రి అంజి, అరిక నరేష్, పూలనారాయణస్వామి, బయపరెడ్డి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి అక్రమాలను ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు వివరిస్తున్న మాజీ మంత్రి శైలజనాథ్, చిత్రంలో పార్టీ నేతలు



భక్తిశ్రద్ధలతో నాగులచవితి

జిల్లావ్యాప్తంగా సోమవారం నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. నాగుల కట్టల వద్ద ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్,అనంతపురం

అనంతపురంలో నాగుల కట్ట వద్ద భక్తుల పూజలు, (ఇన్‌సెట్‌లో) పాలు పోస్తున్న మహిళ

అన్ని వేళ్లూ ఆ అధికారిపైనే...?!

- తేలని గూగూడు కుళ్లాయి స్వామి హుండీ లెక్కింపు కథ
- పర్యవేక్షణాధికారి తీరుపై అంతటా అనుమానాలు

నార్పల: గూగూడు కుళ్లాయి స్వామి ఆలయానికి సంబంధించి ఓ హుండీ లెక్కింపు కథ ఎంతకీ తేలడం లేదు. ఈ క్రమంలో పర్యవేక్షణాధికారి తీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలకలం రేపిన ఈ ఘటనపై సోమవారం దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆలయంలో విచారణ చేపట్టారు. ఆలయ సిబ్బంది, మూడు హుండీల లెక్కింపులో పాల్గొన్న సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆలయంలో సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో పలు మార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడడం గమనార్హం. దీనిపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా.. గూగూడులో విద్యుత్ సరఫరా నిలిపివేయలేదని చెప్పడంతో గ్రామస్తులు, భక్తుల్లో అనుమానాలు మరింత పెరిగాయి. ఈ విషయం తెలిసిన డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆలయ అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అబ్బే నేనలా అనలేదు..!

కానుకలు లెక్కించని హుండీకి సంబంధించి సీసీ కెమెరా ఫుటేజీపై ఈఓ శోభారాణి మాట మార్చడం సర్వత్రా విస్మయానికి గురి చేసింది. సీసీ కెమెరా ఫుటేజీ బ్యాకప్‌ను పక్కాగా భద్రపరిచామని, దేవదాయశాఖ ఉన్నతాధికారులకు అందిస్తానని గతంలో చెప్పిన ఆమె.. డిప్యూటీ కమిషనర్‌తో మాత్రం బ్యాకప్ లేదని చెప్పడం గమనార్హం. మాట మార్చిన విషయంపై ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై ఆమె ఇష్టారీతిన మాట్లాడారు. మీ ఇష్టమొచ్చినట్లు రాసుకోండి అంటూ హూంకరించారు. ఈ క్రమంలోనే కలగజేసుకున్న డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ మీడియా వారితో అలా మాట్లాడటం సరికాదంటూ ఈఓను మందలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ వచ్చినా సమస్య పరిష్కారం కాలేదని, కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి

• ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు బకాయి ఉన్న జూన్ నెల జీతాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 15 నాటికే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ముగిసాయన్నారు. ఈ నెల 28వ తేదీ గడిచినా ఇప్పటి వరకూ పొజిషన్ ఐడీలు క్రియేట్ చేయకపోవడం తో వారికి జీతాలు అందలేదన్నారు. వెంటనే పొజిషన్ ఐడీలు క్రియేట్ చేసి జూన్, జూలై నెలల జీతాలు ఆగస్టు 1న చెల్లించేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పీ–4 బాధ్యతలను ఉపాధ్యాయులకు తప్పించి కేవలం బోధనకే పరిమితం చేయాలన్నారు.

పోరాట యోధుడు తరిమెల నాగిరెడ్డి

• సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్‌బాబు



మాట్లాడుతున్న కిషోర్‌బాబు

అనంతపురం టవర్‌క్లాక్: విద్యార్థి దశ నుంచి ఉద్యమాల బాట పట్టి పోరాట యోధుడిగా తరిమెల నాగిరెడ్డి ఖ్యాతి గడించారని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు జాస్తి కిషోర్‌బాబు అన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో తరిమెల నాగిరెడ్డి వర్ధంతి సభ సోమవారం సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాస్తి కిషోర్‌బాబు మాట్లాడారు. తరిమెల నాగిరెడ్డి స్ఫూర్తిదాయక జీవనాన్ని వివరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సూర్యసాగర్, అమరనాథరెడ్డి, ఎస్ఎం బాషా, పాల్గొన్నారు.

ఆశ పెట్టి.. కొల్లగొట్టి



ఎదుటి వ్యక్తి బలహీనత వారికి ఆసరాగా మారింది. ఇతరుల అవసరాలను ఆలంబనగా చేసుకున్నారు. మాయ చేశారు.. ఆశ చూపారు.. వల విసిరారు. అందులో చిక్కుకున్న సామాన్యులను నిట్టనిలువునా ముంచి రూ.కోట్లలో దోచుకున్నారు. ఇది ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వెలుగు చూస్తున్న వ్యవస్థీకృత ఆర్థిక నేరం. మాఫియాను తలదన్నేలా మోసగాళ్లు చెలరేగిపోవడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.



• ఉమ్మడి జిల్లాలో అధికమవుతున్న ఆర్థిక నేరాలు
• ప్రజల అవసరాలతో ఆటలు
• రూ.లక్షల్లో నష్టపోతున్న బాధితులు
• చిట్టీలు, క్రిప్టో కరెన్సీ, అధిక వడ్డీల మాయలో సామాన్యులు విలవిల

అనంతపురం: కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు కాయకష్టంతో చిరువ్యాపారులు, సామాన్య, మధ్య తరగతి ప్రజలు సంపాదించిన సొమ్ము కాస్త పరుల పాలవుతోంది. భవిష్యత్తు అవసరాలకు పొదుపు చేసుకోవాలనే వారిలోని తపనను మోసగాళ్లు తెలివిగా సొమ్ము చేసుకుని బోర్డు ఫిరాయిస్తున్నారు. అధిక వడ్డీలు ఇస్తామని కొందరు.. క్రిప్టో కరెన్సీతో డాలర్లు మూటగట్టుకోవచ్చని మరికొందరు ఉచ్చులోకి లాగేస్తున్నారు. ఈ క్రమంలో దాచుకున్న డబ్బుతో పాటు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి మోసపోతున్నారు.

బలహీనతలే ఆసరాగా...

డబ్బు సంపాదించాలనే సామాన్య, మధ్య తరగతి ప్రజల బలహీనతలను ఆసరా చేసుకున్న కొందరు క్రిప్టో కరెన్సీ ఉచ్చులోకి తాము చిక్కుకోవడం కాక... పలువురిని అందులోకి లాగేశారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న నమ్మబలికారు. ఈ మాయలో చిక్కుకున్న వారు తాము దాచుకున్న డబ్బుతో పాటు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. చివరకు మోసపోవడంతో మనోవేదనతో నలిగిపోతున్నారు. భారత ప్రభుత్వ ఆమోదం లేని కంపెనీలు కేవలం వెబ్‌సైట్ ద్వారానే లావాదేవీలు నిర్వహిస్తూ రూ. కోట్లలో మోసానికి తెరలేపాయి. మెటా ఫండ్ పేరుతో మొదలైన క్రిప్టో దందా.. రెండు నెలలకే మెటా ప్రో అని పేరు మార్చుకుంది. డబ్బులు రెట్టింపు అవుతాయని ఆశ చూపి రూ.కోట్లు వసూలు చేసి బోర్డు ఫిరాయించింది. లక్ష కడితే రోజూ 15 నుంచి 20 అమెరికన్ డాలర్లు వస్తాయని ఆశ చూపి రూ.లక్ష నుంచి కోటి రూపాయల వరకూ ఒక్కొక్కరి నుంచి డిపాజిట్ చేయించుకున్నట్లుగా తెలుస్తోంది.

సామాన్యుల నడ్డి విరిచిన అధిక వడ్డీ ఆశ

సామాన్యుల ఆర్థిక అవసరాలను అనువుగా మార్చుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిట్టీ వ్యాపారం ఊపందుకుంది. చిట్టీ ఎత్తిన వారికి నగదు చెల్లించకుండా నిర్వాహకులు అధిక వడ్డీ ఆశ చూపుతున్నారు. ఇదే అసలు మోసానికి తెరతీస్తోంది. ఇందుకు నిదర్శనమే ఇటీవల ఉరవకొండలో వెలుగు చూసిన ఉదంతం. ఉరవకొండలోని రంగావీధిలో నివాసముంటున్న దంపతులు నగేష్‌బాబు, లావణ్య.. కిరాణా దుకాణం నిర్వహిస్తూ స్థానికులతో మంచి పరిచయాలు పెంచుకున్నారు. అనంతరం చిట్టీల వ్యాపారం మొదలు పెట్టారు. ఒక్కొక్కరు రూ. 3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ చిట్టీలు కట్టారు. చిట్టీలు ఎత్తిన వారికి అధిక వడ్డీ ఆశ చూపి నగదు చెల్లించకుండా మిన్నకుండిపోయారు. రెండు వారాల క్రితం కుటుంబంతో సహా నగేష్ బాబు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఇంటికి తాళం వేసి ఉంది. ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో అనుమానం వచ్చిన బాధితులు ఆరా తీయగా, డబ్బుతో ఉడాయించినట్లు తెలిసింది. ఈలోపు పలువురి సెల్‌ఫోన్ల వాట్సాప్ నంబర్‌కు నగేష్ బాబు దంపతుల లాయర్ పంపిన ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) నోటీసు అందింది. 57 మందితో రూ.6.22 కోట్ల వరకు నగదు తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిట్టీలు, క్రిప్టో కరెన్సీస అధిక వడ్డీల ఉచ్చులో పడి మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

మచ్చుకు కొన్ని

• 2021లో కళ్యాణదుర్గంలో 'సహారా ఇండియా పరివార్' పేరుతో ఓ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇందులో స్థానికులు ఆంజనేయులు, సలాం కీలకం. వీరు ఏజెంట్లను నియమించుకుని భారీ వడ్డీ ఆశ చూపి చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల నుంచి వారం వారం డిపాజిట్ల పేరుతో డబ్బు వసూలు చేశారు. ఐదేళ్లు, మూడేళ్ల కాల వ్యవధితో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తే రెట్టింపు మొత్తాన్ని ఇస్తామని ఆశ చూపడంతో దాదాపు వెయ్యి మంది సభ్యులుగా చేరారు. వారం వారం కంతులు చెల్లిస్తూ వచ్చారు. మెచ్యూరిటీ గడువు ముగియడంతో నగదు చెల్లించాలని ఖాతాదారులు ఒత్తిడి చేశారు. దీంతో ఆంజనేయులు, సలాం పత్తా లేకుండా పోయారు. ఏజెంట్లూ మాయమయ్యారు. ఈ దందాలో కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.10 కోట్లకు పైగా బాధితులు మోసపోయినట్లు సమాచారం.

• ధర్మవరానికి చెందిన ఓ వ్యాపారి క్రిప్టో కరెన్సీ మోజులో పడ్డాడు. తొలుత భారీగా ఆదాయం వచ్చింది. దీంతో మరి కొంత మందిని చేరిస్తే మరింత లాభం వస్తుందని ఆశపడ్డాడు. బంధువులు, స్నేహితులు అందరికీ క్రిప్టో కరెన్సీ గురించి చెప్పి ఏకంగా రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టించాడు. ఆ తర్వాత సదరు కంపెనీ బోర్డు తిప్పేయడంతో ప్రస్తుతం రోజూ బెంగళూరులోని క్రిప్టో కరెన్సీ ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లడం.. సాయంత్రానికి ధర్మవరానికి చేరుకోవడం పరిపాటిగా మారింది.

• అనంతపురం నగరంలో బ్లాక్‌మనీ అధికంగా ఉండే ఓ సామాజిక వర్గం వారు ఓ వెబ్‌సైట్‌ను నమ్మి క్రిప్టో కరెన్సీలో రూ.20 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టారు. వారం కిందట అప్‌డేట్ చేస్తున్నామని చెప్పి లింక్ తొలగించారు. ఆ తర్వాత అడ్రస్ గల్లంతు కావడంతో తేలు కుట్టిన దొంగల్లా మారింది వారి పరిస్థితి. ఇలా వీరు మాత్రమే కాదు. ఒక్క అనంతపురం నగరంలోనే అత్యాశపరులు క్రిప్టో కరెన్సీ మోజులో పడి తక్కువలో తక్కువగా రూ.100 కోట్లు పైగానే మోసపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ డిమాండ్ చేసింది. పలు డిమాండ్లను నెరవేర్చాలంటూ అనంతపురం అడ్వొకేట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సి. హనుమన్న ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు బయట సోమవారం ధర్నా చేపట్టారు. లా నేస్తం పథకం కింద జూనియర్ న్యాయవాదులకు గత 14 నెలలుగా లబ్ధి చేకూర్చలేదన్నారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బార్‌కౌన్సిల్ ఆఫ్ ఏపీకి అందాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలన్నారు. ధర్నాలో న్యాయవాదులు ఆర్.బాలాజీనాయక్, ఎం.కృష్ణప్ప, అజీజ్, ఎం.శ్రీనివాసులు, రేవతి, గంగాదేవి పాల్గొన్నారు. బహుజన యువసేన పార్టీ చంద్రశ్వర్ల హరి, బీఎస్పీ అధ్యక్షుడు అంపాపతి గోవిందు, హర్షవర్ధన్ రెడ్డి, రామలింగారెడ్డి (సీనియర్ న్యాయవాది), హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, న్యాయవాది నీరజ, జూటూరు సుధాకర్ రెడ్డి, రంగనాయకులు, సాకే నరేష్, లక్ష్మణ్, నారాయణరెడ్డి, అనంతపురం బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ విజయభాస్కర్, ఉమామహేశ్వరి తదితరులు సంఘీభావం తెలిపారు.

వీఆర్‌కు కదిరి టౌన్ సీఐ!

అనంతపురం: కదిరి టౌన్ సీఐ నారాయణరెడ్డిని వీఆర్‌కు పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీ అయినట్లు విశ్వసనీయ సమాచారం. కదిరి టీడీపీలో రెండు గ్రూపులుండగా.. ఓ వర్గానికి సీఐ నారాయణరెడ్డి మద్దతుగా నిలుస్తూ.. మరో వర్గం వారిపై కేసులు బనాయిస్తున్నట్లు మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో సీఐపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు అందడంతో పోలీసు ఉన్నతాధికారులు నారాయణరెడ్డిని వీఆర్‌కు పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

కుక్కను తప్పించబోయి.. యువకుడి మృతి

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కూడేరు మండలం కొర్రకోడు గ్రామానికి చెందిన రమేష్(28) చెన్నేకొత్తపల్లి సమీపంలోని హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులలో హిటాచీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై వెళుతున్న రమేష్... కోన క్రాస్ వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అటుగా వెళుతున్న వారు గమనించి అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రైవేట్ బ్యాంక్‌లో దొంగలు!

• ఖాతాదారులకు తెలియకుండా తాకట్టు బంగారం స్వాహా
• నలుగురి అరెస్ట్
• పరారీలో మరొకరు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జగదీష్

అనంతపురం: ప్రైవేట్ బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు నగలను తీసుకెళ్లి మరో ఫైనాన్స్ సంస్థలో కుదువపెట్టి నగదును కాజేస్తున్న ముఠా గుట్టును అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు రట్టు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను సీఐ కె.జగదీష్‌తో కలసి అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. అనంతపురంలోని హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రాంనగర్ బ్రాంచ్‌లో ఖాతాదారుకు చెందిన ఒక గోల్డ్ ప్యాకెట్ ట్యాంపర్ అయింది. ఒరిజినల్ బంగారం స్థానంలో నకిలీ బంగారాన్ని పెట్టినట్లు గుర్తించారు. దీంతో బ్యాంకులో పనిచేస్తున్న వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆ బ్యాంక్ మేనేజర్ పి వేణుగోపాలరెడ్డి ఈ నెల 14న నాల్గో పట్టణ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో కీలకమైన అంశాలను పసిగట్టారు. ఈ క్రమంలో పక్కా ఆధారాలతో అనంతపురంలోని రాణి నగర్‌కు చెందిన వి.రామాంజనేయులు కుమారుడు సతీష్ కుమార్, జాకీర్ కొట్టాల ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న నరసింహులు కుమారుడు బోయ హెచ్.జయరాములు, కళ్యాణదుర్గం రోడ్డు రాజా హోటల్ వెనుక గణేష్ నగర్‌లో నివాసం ఉంటున్న నాగరాజు కుమారుడు సాయి కృష్ణ, నందమూరినగర్‌కు చెందిన బి.ఓబులేసు కుమారుడు బోయ శ్రీనివాసులు అలియాస్ శీనను అరెస్ట్ చేశారు.

అపహరించారు ఇలా...

కీర్తన ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న నరేష్ (పరారీలో ఉన్నాడు), సతీష్‌కుమార్ ఇద్దరూ కలిసి కదిరిలో మణప్పురం ఫైనాన్స్ సంస్థలో పనిచేసేవారు. ఇద్దరూ విలాసాలు, జల్సాలకు అలవాటుపడ్డారు. జల్సాలు తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. దీంతో సతీస్‌కుమార్ తన క్లాస్‌మేట్ సాయికృష్ణతో పాటు పరిచయమున్న బోయ శ్రీనివాసులు, హెచ్‌డీఎఫ్‌సీలో పనిచేస్తున్న జయరాంతో కలసి పథకం రచించారు. ఇందులో భాగంగా బ్యాంక్‌లో బంగారాన్ని తాకట్టు పెట్టేందుకు వచ్చిన ఖాతాదారులను ఏమార్చి ఆ బంగారాన్ని కీర్తన ఫైనాన్స్‌లో కస్టమర్లకు తెలియకుండా మళ్లించి రుణం పొందేవారు. గడువు పూర్తయిన ఖాతాలకు సంబంధించి నగలను కూడా ఖాతాదారులకు తెలియకుండానే నగదు చెల్లించి.. బంగారు తీసుకెళ్లి కీర్తన ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టేవారు. ఇలా జయరాం పేరిట 330 గ్రాములు, బోయ శ్రీనివాసుల పేరిట 650 గ్రాములు, సాయి కృష్ణ పేరిట 1200 గ్రాములు కీర్తన ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. ఈ క్రమంలో ఇటీవల ఓ ఖాతాదారు తనఖా పెట్టిన బంగారానికి సంబంధించిన ప్యాకెట్ ట్యాంపర్ అయి ఉండడం గమనించిన హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్ ఫిర్యాదుతో మొత్తం బాగోతం వెలుగులోకి వచ్చింది. దీంతో నలుగురు నిందితులను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న నరేష్ కోసం గాలిస్తున్నారు. కేసులో మిస్టరీని ఛేదించి, నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ ఎన్.జగదీష్, ఎస్ఐలు ప్రసాద్, విజయ్ భాస్కర్ నాయుడును ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

విద్యార్థులపై 'కూటమి' చిన్నచూపు



అనంతపురంలోని ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన స్కూల్ బ్యాగులు చిరిగిపోయాయని చూపుతున్న నరేంద్రరెడ్డి



అనంతపురం అరవిందనగర్ బీసీ బాలికల హాస్టల్‌లో ముద్దగా ఉన్న అన్నాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు

• వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకోని సర్కార్
• వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి

అనంతపురం రూరల్: పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని, ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్రరెడ్డి మండిపడ్డారు. సోమవారం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నగరంలోని బీసీ, ఎస్సీ ప్రభుత్వ వసతి గృహాలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. సరిపడ గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో బీసీ సంక్షేమశాఖ, వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రులు ఉన్నా వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు పెద్ద పీట వేశారన్నారు. ప్రభుత్వ బడుల్లో మాదిరే వసతి గృహాల్లో సైతం నాడు–నేడు పనులు చేపట్టి సమూల మార్పులు చేశారన్నారు. మెను ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. వసతి గృహాల్లో సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ ఛార్జీలు అందించాలని, మెను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సుల్తాన్, నగర అధ్యక్షుడు కైలాష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఎస్సీ సెల్ నగర మహిళా అధ్యక్షురాలు సాకే చంద్రకళ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు తిప్పలూరి సుధీర్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి, నవీన్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లపై పీ–4 పిడుగు

• విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ హెచ్‌ఎంలు, టీచర్లకు ఆదేశాలు
• మానసిక క్షోభకు గురి చేయొద్దంటూ అయ్యవార్ల వేడుకోలు
• పీ–4 పని టీచర్లకు వద్దేవద్దంటున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పేదరికం నిర్మూలన పేరుతో ప్రభుత్వం ప్రారంభించిన పీ–4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్) పిడుగు టీచర్లపై పడనుంది. 2047 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని అంతం చేయాలనే ఉద్దేశంతో జనాభాలో 10 శాతం ఉన్న సంపన్నవర్గాలు జనాభాలో 20 శాతం ఉన్న పేద వర్గాలకు అండగా ఉంటూ వారికి ఆర్థిక చేయూతనివ్వాలన్నది ఈ పాలసీ ఉద్దేశం. దీనికి 'బంగారు కుటుంబాలు' అనే నామకరణం చేశారు. అయితే ఈ కార్యక్రమానికి సంపన్నుల నుంచి పెద్దగా స్పందన రాలేదు. దీంతో ఈ భారాన్ని టీచర్లపై బలవంతంగా రుద్దేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా గెజిటెడ్ హెచ్‌ఎంలు ఐదు, టీచర్లు ఇద్దరు చొప్పున విద్యార్థుల కుటుంబాలను ఎంపిక చేసుకుని వారిని దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ కుటుంబాలు పేదరికం నుంచి బయటపడే వరకూ ఆర్థిక చేయూతతో పాటు పిల్లల విద్యా ఫీజులు, ఇతర సదుపాయాలు కల్పిస్తూ అండగా ఉండాలంటూ నిబంధనలు ఖరారు చేసింది. ఎంపిక చేసిన విద్యార్థుల కుటుంబాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాలని, ఇందుకు సంబంధించిన లింక్‌లను అధికారుల నుంచి టీచర్లకు అందజేసింది. ప్రభుత్వ చర్యలతో ఇప్పటికే తీవ్ర అసహనంతో ఉన్న ఉపాధ్యాయులు తాజాగా తీసుకున్న పీ–4 నిర్ణయంతో ఒక్కసారిగా మండిపడుతున్నారు. నాలుగు రోజులు జీతాలు ఆలస్యమైతే దిక్కులు చూస్తూ అల్లాడిపోయే టీచర్లను సంపన్నవర్గాల్లో చేర్చడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మానసిక క్షోభకు గురి చేసే ఇలాంటి చర్యలు వద్దే వద్దని నినదిస్తున్నారు. చదువు చెప్పేందుకు విద్యార్థులను దత్తత తీసుకుంటాం కానీ వారి కుటుబాలకు ఆర్థిక చేయూతనివ్వడం సాధ్యం కాదని తేల్చి చెబుతున్నారు.

నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి





పీ–4 కార్యక్రమం అమలు హెచ్‌ఎంలు, టీచర్లపై బలవంతంగా రుద్దడం సరికాదు. విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ అధికారులు ఒత్తిళ్లు చేయడం బాధాకరం. బోధనేతర కార్యక్రమాలతో విద్యారంగం మరింత భ్రష్టు పడుతుందని వాపోతున్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి.

– ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, టి.చంద్రశేఖరరెడ్డి, పీఆర్టీయూ

టీచర్లపై రుద్దడం అన్యాయం





పీ–4 కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దడం అన్యాయం. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితి చేయాలి. బోధనేతర కార్యక్రమాలు కట్టబెట్టడం సబబు కాదు. ప్రభుత్వ బడుల్లో చదువుతున్న బడుగు, బలహీన వర్గాల పిల్లల బోధన కుంటు పడేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి.

– నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, ఎస్టీయూ

దంపతుల అనుమానాస్పద మృతి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో సోమవారం కర్ణాటకకు చెందిన దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్న స్థితిలో మృతదేహాలు కన్పించాయి. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు.. కర్ణాటకలోని హొస్పేట ప్రాంతానికి చెందిన దంపతులు హఫ్రీనా (20), రెహమాన్ (25) నెల క్రితం నేమకల్లుకు వచ్చారు. ఆర్యవైశ్య కాంప్లెక్స్‌లో గదిని అద్దెకు తీసుకుని ఉంటూ.. శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయం, కాంప్లెక్స్‌కు పెయింటింగ్ పనులు చేశారు. ఇవి ముగిసిన తరువాత గ్రామంలోని మరికొందరి ఇళ్లకు పెయింటింగ్ పనులు చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి గది నుంచి బయటకు రాలేదు. స్థానికులకు అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా.. ఇద్దరూ ఉరి వేసుకున్న స్థితిలో కనిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నగరపాలక సంస్థ ఈఈగా చంద్రశేఖర్



ఈఈ చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంజినీర్లు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఈఈగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు నగరపాలక సంస్థలో డీఈగా ఉన్న ఈయనకు ఈఈగా పదోన్నతి కల్పించి అనంతపురం నగరపాలక సంస్థకు బదిలీ చేశారు. కమిషనర్ బాలస్వామి వద్ద ఆయన రిపోర్టు చేసుకున్నారు. అనంతరం ఎస్ఈ చంద్రశేఖర్ తదితరులను కలిశారు. గతంలో ఈయన అనంతపురం నగరపాలకస సంస్థ డీఈగా పని చేశారు.

రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపిక



లిఖితా రెడ్డిని అభినందిస్తున్న హెచ్ఎం గంగాభవాని, పీడీ జగదీష్

ఆత్మకూరు: మండలంలోని తలుపూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని లిఖితా రెడ్డి రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ జగదీష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీటీసీ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో లిఖితా రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆగస్టులో 9, 10 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో లిఖితా రెడ్డి పాల్గొంటుందని తెలిపారు. సత్తా చాటిన విద్యార్థిని పాఠశాల హెచ్ఎం గంగాభవాని అభినందించారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్ పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ జ్యోతుకుమార్, తహసీల్దార్ లక్ష్మీనాయక్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, మండల వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది కలసి ఈ-క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. రైతు ఏ పంట సాగు చేస్తే ఆ పంటనే ఈ-క్రాప్ చేయాలన్నారు. ఈ-క్రాప్ చేసుకుంటేనే రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పీఎంకిసాన్ పథకాలు అందుతాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చేయండి సారూ..

ఆత్మకూరు: వేసవిలో చేతిపంపులకు చేసిన మరమ్మతులకు బిల్లులు చెల్లించాలని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హ్యాండ్‌పంప్ మెకానిక్‌గా పని చేస్తున్న శివ అధికారులను కోరుతున్నాడు. పనులు చేసి మూడు నెలలు దాటింది.. ఆటో బాడుగ, ఇతర ఖర్చులు కూడా నేనే పెట్టుకున్నా.. చేసిన పనికి నాకు బిల్లు చెయ్యండి. లేదంటే ఆత్మహత్య చేసుకుంటా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. బిల్లుల కోసం ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు ఫోన్ చేసినా స్పందించడం లేదని చెబుతున్నాడు.

హెచ్ఐవీ నివారణకు కృషి



మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో హెచ్ఐవీ ప్రభావిత కేసులున్న ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన మొబైల్ ఐసీటీసీ వాహనాన్ని సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ పరీక్షలు చేయాలన్నారు. హెచ్ఐవీ నివారణకు కృషి చేయడానికి అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్, ఎన్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువతి దుర్మరణం

అనంతపురం సిటీ: నగరంలోని ఐటీఐ మిట్ట వద్ద సోమవారం సాయంత్రం పట్టాలు దాటుతున్న యువతి (30)ని వందేభారత్ రైలు ఢీకొంది. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన ఆమెను అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు కోలుకోలేక ఆమె మృతి చెందింది. ఐదు అడుగుల ఎత్తు, చామనఛాయ, కాఫీ కలర్ పంజాబీ డ్రెస్ ధరించి ఉందన్నారు. ఇంతకు మించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని యువతి మృతి కింద కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇదెక్కడి ప్రభుత్వం బాబూ?

- కూటమి ఏడాది పాలనపై భగ్గుమంటున్న ప్రజానీకం
- పథకాలు అమలు చేయకపోవడంతో ఆగ్రహం
- వైఎస్ జగన్ పాలనలో జరిగిన సంక్షేమాన్ని గుర్తు చేసుకుంటున్న ప్రజలు
- జోరుగా సాగుతున్న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'
- చంద్రబాబు మోసాలను వివరిస్తున్న కార్పొరేటర్లు, నాయకులు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త అనంతకు సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 13 నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఏ డివిజన్‌కు వెళ్లినా.. ఇదెక్కడి ప్రభుత్వం బాబూ.. అంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ నుంచి సంక్షేమ పథకాలు అందేవి. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా తమను పట్టించుకునే నాథుడు లేరని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇటీవల పిలుపునిచ్చిన బాబూ ష్యూరిటీ–మోసం గ్యారంటీ ('రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో') కార్యక్రమం అనంతపురం అర్బన్ పరిధిలో జోరుగా కొనసాగుతోంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్త అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు మోసాలతో కలిగిన నష్టం, నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, ఉచిత బస్సు, 50 ఏళ్లకే పెన్షన్‌తో పాటు మరో వందకుపైగా పథకాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా తమను ముంచిందని.. జగనన్న ప్రభుత్వంలో పథకాలు బాగా అందినట్లు చెబుతుండడం గమనార్హం. రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని.. 5 కేజీల బియ్యానికి ఒక కేజీ తగ్గించి రేషన్ అందించే పరిస్థితి ఉందని వృద్ధులు చెబుతున్నారు.

ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది..

కూటమి ప్రభుత్వం పాలనలో అనతికాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ హామీని సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేయకలేదు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. పెన్షన్ కోత విధించారు. తల్లికి వందనం పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. అభివృద్ధి కునుమరుగైంది. ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తాం. పార్టీ శ్రేణులు చురుగ్గా కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు.

– అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు

అరకొరగా 'తల్లికి వందనం'



తల్లికి వందనం ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరికీ వస్తుందన్నారు. నా కూతురు ఇందు 7వ తరగతి చదువుతోంది. తనకు రూ.13000 జమ అయ్యింది. బాబు అవినాష్ రాజేంద్ర నగరపాలక సంస్థ పాఠశాలలో చదువుతున్నాడు. బాబుకు రూ.10,900 మాత్రమే పడింది. త్వరలో కేంద్రం ప్రభుత్వం వాటా వచ్చిన వెంటనే మిగతా మొత్తం జమ అవుతుందని సందేశం వచ్చింది. మొత్తం డబ్బులు వేసింటే బాగుండు. అరకొరగా డబ్బు జమ చేయడం సరికాదు.

– లక్ష్మి, అంబేడ్కర్ నగర్

పింఛన్ ఎప్పుడిస్తారు?



నా భర్త సయ్యద్ మహ్మద్ షుగర్, బీపీతో ఇబ్బంది పడడంతో పాటు కాళ్లు సరిగా లేవు. 74 శాతం వికలాంగత్వం ఉందని వైద్యులు నిర్ధారణ చేసి సర్టిఫికెట్ ఇచ్చారు. కానీ పింఛన్‌కు దరఖాస్తు చేసినా ఇంత వరకు మంజూరు చేయలేదు. ఏడాదిగా ఇబ్బంది పడుతున్నాం. ఇల్లు గడవడమే ఇబ్బందిగా ఉంటుంది. అర్హులైన వారికి పింఛన్ ఇవ్వకపోతే ఎలా? ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పథకాలన్నీ అమలు చేయాల్సిందే.

– హసీన, వినాయక నగర్

భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల మండలం కల్లుమడి గ్రామంలో నల్లమ్మకు చెందిన 85 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన వారు దౌర్జన్యంగా అక్రమిస్తున్నారని తెలిపారు. సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో సమస్యను పరిష్కరించాలని వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బాధితురాలు నల్లమ్మ, దుర్గ, పవన్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రాప్తాడు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. చెట్లను విచ్చలవిడిగా నరికి వేయడం వల్ల కాలుష్యం పెరిగిపోయి జీవకోటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మొక్కలను పరిరక్షించుకోకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మల్లికార్జున, కుళ్లాయప్ప, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, హెచ్ఎం ఆంజనేయులు, సర్పంచ్ సాకే తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం



ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న పీఏసీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు అందరినీ ముంచారని మేయర్ వసీం విమర్శించారు. సోమవారం నగరంలోని 38, 39వ డివిజన్లలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ (రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో) కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డితో కలసి మేయర్ మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. 38వ డివిజన్‌లో రూ.2.5 కోట్లు, 39వ డివిజన్‌లో రూ.3 కోట్లతో ప్రధాన రోడ్లుతో పాటు అంతర్గత రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అదేవిధంగా 10, 21, 24, 29, 30, 31, 38, 39, 47, 49 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు. పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, ఓబిరెడ్డి, సైఫుల్లాబేగ్, మల్లెమీద నరసింహులు,పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివరామిరెడ్డి, ఇంటెలెక్చువల్ ఫోరం తనీష, శంకరయ్య, కార్పొరేటర్లు శ్రీనివాసులు, గురుశేఖర్ బాబు, లక్ష్మీదేవి, సుమతి, సంపంగి రామాంజనేయులు, చింతకుంట సుశీలమ్మ, దుర్గాదేవి, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, మునిశేఖర్, నాయకులు చింతకుంట మధు, బ్రహ్మానందరెడ్డి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, ఖాజా, రాజారెడ్డి, లక్ష్మణ్ణ, నాగలాలు, రియాజ్, రాధాకృష్ణ, సూర్యనారాయణ రెడ్డి, సాయి, భారతి, భాను, విక్కీ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబూ అంటే మోసం పక్కా

చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నా.. మోసం పక్కా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహాలక్ష్మి శ్రీనివాస్ పేర్కొన్నారు. 25వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డులో సోమవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలతో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్లారన్నారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా ఇంత వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగంపేట గోపాల్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రపాడు హుస్సేన్‌పీరా నాయకులు అశోక్‌రెడ్డి, అవైస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలంటే ఎందుకంత చులకన?



ఆందోళన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్: 'ఎస్సీ, ఎస్టీలంటే అధికారులకు ఎందుకంత చులకన? సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా భూ సమస్యలు నెలలుగా పరిష్కారం కావడం లేదు. ఎస్సీ, ఎస్టీల భూములకు రక్షణ కల్పించాలి' అని ఎస్సీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేశారు. భూములకు సంబంధించిన సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కారం కావడం లేదు.. తహసీల్దార్లు ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. రూరల్ మండలం కురుగుంటలో సర్వే నంబర్ 136–3లో ఎరికల ఆదినారాయణమ్మకు చెందిన భూమిని కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించారని చెప్పారు. దీనిపై ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా పరిష్కరించలేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇన్‌చార్జి కలెక్టర్ స్పందిస్తూ.. ఆదినారాయణమ్మ భూమిలో నేరేడు చెట్లు తొలగించిన వారిపై కేసు నమోదు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఘటనల్లో చట్ట ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో బాధితురాలు ఆదినారాయణమ్మ, ఎస్సీ సంఘాల నాయకులు నెరిమెట్ల ఎల్లన్న, చిన్నపెద్దన్న, నాగేష్, రమణ, పకీరప్ప, చిర్రాళ్ల రామాంజనేయులు, చిన్న ఆంజనేయులు, అక్కులప్ప, సీసీఓబుళేసు, మద్దెలచెరువు మల్లి, దిమ్మగుడి రామాంజి, భాస్కర్, నార్పల పుల్లప్ప, సత్యమయ్య పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలోని రూములకు ఈనెల 30వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నాగేంద్రుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

దోషులను శిక్షించాలి



నిరసన తెలుపుతున్న మహిళా సమాఖ్య నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: ధర్మస్థల ఘటనలో దర్యాప్తు వేగవంతం చేసి దోషులను శిక్షించాలని మహిళా సమాఖ్య నాయకురాళ్లు డిమాండ్ చేశారు. సోమవారం పాతూరులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి మాట్లాడారు. కర్ణాటకలోని మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో 1998 నుంచి 2014 వరకు వందల మంది మహిళలు, యువతులు అత్యాచారం, హత్యకు గురైనట్లు ఇటీవల వెలుగులోకి వచ్చిందన్నారు. రాజకీయ జోక్యానికి తావివ్వకుండా ఘటనపై దర్యాప్తు చేయాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షురాలు కమ్మక్క, నగర అధ్యక్ష, కార్యదర్శులు యశోదమ్మ, జానకి, నాయకురాళ్లు లక్ష్మీదేవి, ఆజాబీ, అరుణ, గీతాంజలి, శ్యామల, లలిత, రాములమ్మ, రింగమ్మ, రమాదేవి, వెంకటలక్ష్మి, పుల్లమ్మ, స్వాతి, రంగనాయకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో లాభాలు



మాట్లాడుతున్న ఆత్మా పీడీ పద్మలత

రాప్తాడు: ఖరీఫ్ పంటల సాగులో రైతులు నూతన వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం, ఆత్మా పీడీ పద్మలత సూచించారు. సోమవారం హంపాపురంలోని రైతు సేవ కేంద్రంలో భూసార పరీక్షల ఫలితాలు, పంటల సాగులో తీసుకోవాల్సిన పలు సూచనలు, సలహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు, పురుగు మందులకు స్వస్తి చెప్పి పంటల సాగులో వైవిధ్యతను ప్రోత్సహించాలన్నారు. పంటల సాగుకు ముందు ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితాలను ఆధారంగా ఎరువులను వాడి పంట దిగుబడులు పెంచుకోవాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వేయడం ద్వారా భూసార పెరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా జీవన ఎరువులు అయిన ట్రైకోడెర్మవిరిడి, సుడోమోనాస్ వంటి రువులు విరివిగా వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ క్రిష్ణ చైతన్య, ఏఈఓలు సుజిత, రంజిత, వీహెచ్ఏ పావని, డీఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలించకుండా రైతుల కాపలా..



పెన్నానదిలో ఇసుక తరలిపోకుండా లైట్లు వేసుకుని కాపలాకాస్తున్న రైతులు

శింగనమల: మండలంలోని నిదనవాడ గ్రామ సమీపంలోని పెన్నానదిలో పెద్దవడుగూరు మండలం ఉప్పలపాడు తదితర గ్రామాల టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో నిదనవాడ గ్రామంలోని రైతులు పార్టీలకతీతంగా పెన్నానదిలోకి వెళ్లి కాపలా కాస్తున్నారు. పెన్నానదిలో నిదనవాడ పొలిమేర వరకూ సోమవారం రాత్రి రైతులు వెళ్లి పరిశీలించారు. పెన్నానదిలో అక్రమంగా ఇంత భారీ స్థాయిలో ఇసుక తరలిపోతున్నా పెద్దవడుగూరు మండల రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

'గుత్తి' ఘటన పునరావృతం కాకూడదు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ చంద్రకుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: 'నాలుగు రోజుల క్రితం గుత్తి మండలం రజాపురం సమీపంలోని గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని కిందకు పడి తీవ్ర గాయాలపాలైంది. రెసిడెన్షియల్ స్కూళ్లల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తగా ఉండాలి' అని సోషల్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ సూచించారు. సోమవారం ఆయన అనంతపురం రూరల్ మండలం కురుగుంట కేజీబీవీని సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోజనం నాణ్యతగా ఉంటోందా? అని అడిగారు. ఏ చిన్న పొరపాటు జరిగినా యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఎస్ఓ నర్మద పాల్గొన్నారు.

సనాతన ధర్మమనే మాటే హాస్యాస్పదం



ప్రసంగిస్తున్న విప్లవ కవి జెట్టీ జైరామ్

అనంతపురం కల్చరల్: డిప్యూటీ చీఫ్ మినిష్టర్ హోదాలో ఉండి కూడా పవన్ కల్యాణ్ చెబుతున్న సనాతన ధర్మం మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని విరసం (విప్లవ రచయితల సంఘం) మాజీ సభ్యుడు, సీనియర్ రచయిత జెట్టీ జైరామ్ ఎద్దేవా చేశారు. సోమవారం విప్లవతారలు టీఎన్ (తరిమెల నాగిరెడ్డి), దేవులపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జెట్టీ జైరామ్ మాట్లాడుతూ.. తరిమెల నాగిరెడ్డి స్ఫూర్తిదాయక పోరాటాలు, ఆయనతో కలిసి పని చేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. సినిమా హీరోల వెంట పడకుండా నిజమైన దేశభక్తులైన తరిమెల నాగిరెడ్డి వంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్ కల్యాణ్ బీజేపీ వలలో చిక్కి ప్రతి ఇంట్లో ముగ్గురు కంటే ఎక్కువ మందిని కనాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసలే పేదరికంలో ఉన్న దేశం మరింత దారుణంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (ఎంఎల్) కార్యదర్శి భాస్కర్, భారత చైనా మిత్ర మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌రెడ్డి, నాగభూషణం, జి.భాస్కర్, ఓపీడీఆర్ కార్యదర్శి బాలు వివిధ విప్లవ సంస్థల ప్రతినిధులు, రచయితలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహా కుంభోత్సవం

అనంతపురం కల్చరల్: హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ స్వామి దేవస్థానంలో మహా కుంభోత్సవం ఘనంగా సాగింది. సోమవారం ఉదయం, సాయంత్రం వేర్వేరుగా శ్రీచక్ర సహిత అష్టకాల భైరవేశ్వరుడికి అన్నాభిషేకం చేపట్టారు. ఆలయ ప్రతినిధి మఠం బసవరాజ స్వామి నేతృత్వంలో సాగిన వేడుకల్లో భక్తులు బారులు తీరి పవిత్ర జలాలతో మహాశివుడికి అభిషేకం చేశారు. అష్టోత్తర నామార్చన అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

'నెలాఖరులోపు ప్రీమియం చెల్లించాలి'

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఖరీఫ్‌కు సంబంధించి ఈ-క్రాప్ (పంట నమోదు) ప్రక్రియ మొదలైనందున క్షేత్రస్థాయిలో పక్కాగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం డివిజన్ ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ ఆదేశించారు. సోమవారం స్థానిక డివిజన్ కార్యాలయంలో టెక్నికల్ ఏఓ సాయిలక్ష్మితో కలిసి ఆరు మండలాల ఏఓలతో సమావేశం నిర్వహించారు. రైతులకు మేలు జరిగేలా సాగు చేసిన పంట మాత్రమే ఈ-క్రాప్‌లో నమోదు కావాలన్నారు. ఫసల్‌బీమా, వాతావరణ బీమా కింద నోటిఫై చేసిన పంటలకు నెలాఖరులోపు రైతులు ప్రీమియం చెల్లించి బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఉరవకొండ రూరల్: చిన్నముష్టూరు సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపల్ అష్రఫ్ అలీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలీసెట్ తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన నేపథ్యంలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: రాంనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ 18వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటూ ఘనంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గణపతి, శ్రీదేవి, భూదేవి, ఆంజనేయస్వామి, విశ్వక్సేనుడు, గరుత్మంతుడు, నవగ్రహ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం గోపూజలు, వృత్యంగ్రహ పూర్వక అంకురార్పణ, అష్టావధాన సేవ, బుధవారం విశేష అభిషేకాలు, హోమాలు, గురువారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠలు, మహాపూర్ణాహుతి, శ్రీవారి కల్యాణోత్సవ వేడుకలు, సాయంత్రం గరుడ వాహనంతో శ్రీవారి నగరోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నీ



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ జట్టు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన సెయింట్ విన్సెంట్ డీ పాల్ జట్టు

అనంతపురం: ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు జరిగిన టోర్నీలో 40 పాఠశాలలకు చెందిన జట్లు పోటీపడ్డాయి. బాలుర విభాగంలో రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్ విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో సెయింట్ విన్సెంట్ డీ పాల్ పాఠశాల విజేతగా నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ భీమలింగా రెడ్డి, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, పీఈటీలు నారాయణ రెడ్డి, నారాయణ, బాలకృష్ణ, కోచ్‌లు కుమార్, వినయ తుల్లా, ప్రవీణ్, మధు నాయక్ తదితరులు పాలొన్నారు.

నాగదేవతలకు పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరుడికి క్షీరాభిషేకం



రాప్తాడు: పుట్టకు పాలు పోస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు: అనంతపురం నగరం, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో సోమవారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణంతో వచ్చిన తొలి పండుగ కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూలు బియ్యం, దంచిన చలిబిండి, పాలు, పండ్లు నైవేద్యం సమర్పించి నాగదేవతలను పూజించారు. తపోవనంలోని జగదీశ్వరాలయంలో నాగుల కళాజాత వేడుకగా సాగింది. కోలాటం, చెక్కభజన కళాకారులు తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.